విద్యాబోధనలో నవశకం

రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు కార్యక్రమం ద్వారా సర్కారు బడులను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్దడంతోపాటు విద్యాబోధనలో నవశకానికి శ్రీకారం చుట్టింది. ఇంగ్లిష్ ల్యాబ్‌లు, డిజిటల్ క్లాస్ రూములు ఏర్పాటు చేసి విద్యార్థులకు పాఠాలు బోధిస్తోంది. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసి సాంకేతికతను వినియోగించుకుని విద్యాభ్యాసం చేసేలా చర్యలు చేపట్టడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా బోధన
- ఇంగ్లిష్ ల్యాబ్‌లు, డిజిటల్ క్లాస్‌రూముల ఏర్పాటు
- శ్రద్ధగా పాఠాలు వింటున్న విద్యార్థులు
- రాష్ట్ర ప్రభుత్వ చర్యలు భేష్ అంటున్న తల్లిదండ్రులు



బైజూస్ యాప్ ద్వారా విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

దుత్తలూరు: సర్కారు బడుల్లో విద్యాబోధన ఎంతో ఆసక్తికరంగా సాగుతోంది. మనబడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమంలో బోధనను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఒకప్పుడు ఇంగ్లిషు ల్యాబ్‌లు కేవలం ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలోనే ఉండేవి. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో నవశకానికి బాటలు వేస్తూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ విద్యాభ్యాసం చేసేలా చర్యలు తీసుకున్నారు. సర్కారు బడుల్లోనూ పేద విద్యార్థులకు ఇంగ్లిషు ల్యాబ్‌లు, డిజిటల్ క్లాస్ రూములను అందుబాటులోకి తెచ్చారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లను సైతం ప్రభుత్వం అందజేసింది. దీంతో విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధతో విద్యనభ్యసిస్తున్నారు.

ట్యాబ్‌ల పంపిణీ

ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 3,265 మంది 8వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేసింది. ఆయా ట్యాబ్‌ల్లో బైజూస్ యాప్‌ను నిక్షిప్తం చేశారు. విద్యార్థులకు తరగతి గదుల్లో ట్యాబ్‌ల ద్వారానే పాఠాలు బోధిస్తున్నారు. అలాగే ఎల్‌ఈడీ ప్రొజెక్టర్లు తరగతి గదుల్లో అమర్చి పాఠాలు బోధిస్తుండడంతో ఈ బోధన విద్యార్థులను ఆకట్టుకుంటోంది. అంతేకాక ఉపాధ్యాయులు కూడా డిజిటల్ పాఠాలు ఎలా బోధించాలనే అంశంపై ప్రభుత్వం శిక్షణ ఇచ్చింది. ప్రతి రోజూ పాఠశాలలో రెండు పీరియడ్స్‌లో ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు తప్పనిసరిగా డిజిటల్ విధానంలో బోధించాల్సిఉంది. విద్యార్థులు సాధారణ పాఠాల కన్నా డిజిటల్ క్లాస్‌రూంలో చెబుతున్న పాఠాలను ఆసక్తిగా వింటున్నారు. మౌఖికంగా చెప్పే పాఠాల కన్నా ప్రొజెక్టర్ ద్వారా చెప్పే పాఠాలు ఆసక్తిగా ఉంటున్నాయని విద్యార్థులు చెబుతున్నారు. ఆండ్రాయిడ్ యాప్ ద్వారా బోధనపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ప్రతి పాఠ్యపుస్తకంలో ఉన్న క్యూఆర్ కోడ్‌ను ఇంటర్నెట్ సాయంతో స్కాన్ చేస్తే ఆ పాఠాలన్నీ తెరపై ప్రత్యక్షమవుతాయి. ఇంటర్నెట్ సౌకర్యం లేని స్కూళ్లకు పెన్‌డ్రైవ్, సెల్‌ఫోన్ల ద్వారా ఎల్‌ఈడీ ప్రొజెక్టర్లకు కనెక్ట్ చేసి డిజిటల్ పాఠాలు బోధిస్తున్నారు. ఈ విధానం చాలా ఉపయోగకరంగా ఉందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న విద్యా సంస్కరణల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మండలాల వారీగా విద్యార్థులకు అందించిన ట్యాబ్‌ల వివరాలు

మండలం	అందించిన ట్యాబ్‌లు
కలిగిరి	411
కొండాపురం	488
ఉదయగిరి	483
వింజమూరు	438
వరికుంటపాడు	343
దుత్తలూరు	336
జలదంకి	493
సీతారామపురం	273

బైజూస్‌తో సందేహాలు నివృత్తి



మౌఖికంగా తరగతి గదుల్లో చెప్పే పాఠాలు అర్థం కాకపోయినా బైజూస్ ద్వారా వాటిని నివృత్తి చేసుకుంటున్నాం. ట్యాబ్‌ల ద్వారా తరగతి గదిలో ఉపాధ్యాయులు బోధించే అంశాలు సులభంగా అర్థమవుతున్నాయి.

– ఎస్‌కే రిజ్వానా, 8వ తరగతి, దుత్తలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల

ఆసక్తి పెరిగింది



విద్యాబోధనలో వినూత్న మార్పులు రావడంతో చదువుపై ఆసక్తి పెరిగింది. అలాగే మధ్యాహ్న భోజనం మెనూ, నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి మాకు విద్యనందిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలపై మా తల్లిదండ్రులకు నమ్మకం ఏర్పడింది.

– ఐ.హర్షిత, 8వ తరగతి, దుత్తలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల

పాఠాలు అర్థమయ్యేలా బోధిస్తున్నాం

విద్యార్థులు బైజూస్ యాప్‌ను వినియోగించడం వల్ల పాఠాలు ఇంకా సులభంగా అర్థమవుతున్నాయి. ఉపాధ్యాయులు సైతం ట్యాబ్‌ల ద్వారా బైజూస్‌లో పాఠ్యాంశాలు అర్థమయ్యేరీతిలో బోధించడానికి అవకాశం ఏర్పడింది. రెండు మాధ్యమాల్లో బైజూస్ యాప్ ఉండడం వల్ల విద్యార్థులకు సులభతరంగా ఉంటోంది.

– సైమన్‌రావు, ప్రిన్సిపల్, ఏపీ మోడల్ పాఠశాల, దుత్తలూరు

క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితునికి ఆర్థికసాయం



దుత్తలూరు: స్థానిక ఏసీ కాలనీ సమీపంలో నివాసం ఉంటున్న చలంచర్ల కల్లయ్య అనే వ్యక్తికి చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు ఇటీవల అగ్నికి ఆహుతి కాగా, ఈ విషయం తెలుసుకున్న కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మంగళవారం బాధితుడికి రూ.25 వేల తక్షణ నగదు సాయం అందించారు. అలాగే గుండె జబ్బుతో బాధపడుతూ మంచం పట్టిన వేలూరు వెంకాయమ్మకు రూ.10 వేలు, ఒంటరి మహిళ కోట నందినికి రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో హనుమంతునాయుడు, అంజయ్యనాయుడు, అనంతయ్యనాయుడు, జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం.శోభ

కావలి: పట్టణంలోని సబ్ జైల్‌లో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కావలి సీనియర్ సివిల్ జడ్జి ఎం.శోభ హాజరై మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన చిన్నచిన్న తప్పిదాల వల్ల జీవితాలు చిన్నాభిన్నం అవుతున్నాయని తెలిపారు. అనంతరం ఖైదీలకు పలు చట్టాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఐ.సాయిప్రసాద్, నరసింహారావు, జైలు సూపరింటిండెంట్ చిన్నసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాగింగ్ చేస్తే జైలు



మాట్లాడుతున్న సీఐ సాంబశివరావు

వింజమూరు: సీనియర్ విద్యార్థులు జూనియర్లను ర్యాగింగ్ చేస్తే జైలుశిక్ష తప్పదని సీఐ సాంబశివరావు హెచ్చరించారు. మంగళవారం స్థానిక వివేకానంద కళాశాలలో ర్యాగింగ్ నిషేధంపై ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ల పట్ల సోదరభావం కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు చెరువులు, కుంటలు, బావుల్లోకి ఈతకు వెళ్లరాదని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై జంపానికుమార్, ప్రిన్సిపల్ ఎం.గోపాల్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మేకపాటికి కృతజ్ఞతలు

జలదంకి: వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించినందుకు ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని జలదంకి మాజీ ఎంపీపీ పాలవల్లి మాలకొండారెడ్డి అన్నారు. మంగళవారం మర్రిపాడులోని ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి నివాసంలో ఎమ్మెల్యేతోపాటు, వైఎస్సార్‌సీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిలను మాలకొండారెడ్డి కలిసి సన్మానించారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు గుర్రం జగ్గయ్యనాయుడు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు వట్టికాల బాలయ్య, సర్పంచ్‌లు రావి ప్రసాద్‌నాయుడు, టి.సతీష్‌నాయుడు, బీవీ కృష్ణారెడ్డి, బుర్రి శ్రీవేణి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

ఆత్మకూరురూరల్: వైద్యుల సూచనలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ అనూష పేర్కొన్నారు. 'ఫ్యామిలీ ఫిజీషియన్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని గండ్లవేడులో మంగళవారం పలువురికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 77 మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి మల్లెంకొండయ్య, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణారెడ్డి, ఏఎన్‌ఎం భూదేవి, పీహెచ్‌సీ అధికారి సుప్రియ, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ఆత్మకూరు: స్థానిక మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా నిర్వహించారు. టీడీపీ తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. అలాగే పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బాబురెడ్డిని గెలిపించాలని నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు, పులిమి శైలజ, పయ్యావుల మారుతినాయుడు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

టైలర్ల సంక్షేమానికి చేయూత అందిస్తాం

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డిని సన్మానించిన టైలర్లు

కావలి: కావలి నియోజకవర్గంలోని టైలర్ల సంక్షేమానికి చేయూతనందిస్తామని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో మంగళవారం టైలర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. కులవృత్తులు, చేతివృత్తుల వారిని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందిస్తోందని తెలిపారు. అలాగే టైలర్లకు కూడా ప్రభుత్వం ఆర్థికసాయం అందించిందన్నారు. టైలర్లకు ఏ సమస్య ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు కాకపోతే వెంటనే సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం టైలర్లందరూ ఎమ్మెల్యేని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టైలర్స్ అసోసియేషన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో ఘన విజయం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి, పక్కన గురుమోహన్

ఆత్మకూరు: వైఎస్సార్‌సీపీ తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించేలా పార్టీ కేడర్ సమష్టిగా కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో స్థానిక మున్సిపల్ పరిధిలోని శ్రీధర్ గార్డెన్స్‌లో మంగళవారం ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సూచనలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు గురుమోహన్ పాల్గొని మాట్లాడారు. శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికయ్యేందుకు ముమ్మర ప్రచారం చేయాలని గురుమోహన్ కోరారు. పేర్నాటి మాట్లాడుతూ పట్టభద్రులు తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలోని నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు శాసనమండలిలో తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో 8,879 మంది పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఎంపీపీలు కేతా వేణుగోపాల్‌రెడ్డి, బోయిళ్ల పద్మజారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జి.వెంకటరమణయ్య, వైస్ చైర్మన్లు డాక్టర్ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, సీనియర్ నాయకులు ఐవీ రమణారెడ్డి, మండల కన్వీనర్లు తూమాటి విజయభాస్కర్‌రెడ్డి బొర్రా సుబ్బిరెడ్డి, రఘురామిరెడ్డి, శంకర్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, పెయ్యల సంపూర్ణమ్మ, కె.శోభ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీఓ మహిళా కార్యవర్గాల ఎన్నిక

ఉదయగిరి: ఏపీ ఎన్జీఓ ఉదయగిరి తాలూకా మహిళా కార్యవర్గాన్ని స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఉదయగిరి తాలూకా చైర్‌పర్సన్‌గా కె.చెంచమ్మ, కోపర్సన్‌గా కె.సంపూర్ణ, కన్వీనర్‌గా సంయుక్తారెడ్డి, కోకన్వీనర్లుగా షేక్ మెహరాజ్, ఉషారాణి, వైస్ చైర్‌పర్సన్లుగా జానకి, దయానశ్రీ, లావణ్య, జాయింట్ కన్వీనర్లుగా మాధవి, సుజాత, విజయలక్ష్మి, ఈసీ మెంబర్లుగా సరస్వతి, సుప్రజలను ఎంపిక చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

వింజమూరు తాలూకా కార్యవర్గం

వింజమూరు: ఏపీ ఎన్జీఓ వింజమూరు తాలూకా మహిళా విభాగం కార్యవర్గాన్ని మంగళవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో ఎన్నుకున్నారు. ఏపీ ఎన్జీఓ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఇ.కరుణమ్మ, యు.చిన్నమ్మ, నగర జాయింట్ సెక్రటరీ షేక్ షంషుద్దీన్ పరిశీలకులుగా ఈ ఎన్నిక జరిగింది. వింజమూరు తాలూకా చైర్‌పర్సన్‌గా ఎస్.జయలక్ష్మి, కోచైర్మన్‌గా ఎం.సుజాత, కన్వీనర్‌గా సీహెచ్ సుభాషిణి, కోకన్వీనర్‌గా కె.అరుణ, ట్రెజరర్‌గా రాధ, వైస్ చైర్‌పర్సన్లుగా సుజాత, కోమలాదేవి, రాజేశ్వరి, జాయింట్ కోకన్వీనర్లుగా ఎం.సుజాత, కె.శిరీష ఎన్నికయ్యారు.

కావలి తాలూకా కార్యవర్గం

కావలిరూరల్: ఏపీ ఎన్జీఓ కావలి తాలూకా మహిళా విభాగం కార్యవర్గాన్ని మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. కావలి తాలూకా అధ్యక్షురాలిగా డి.రత్నవల్లి, ఉపాధ్యక్షురాలిగా టి.శ్రీలత, సభ్యులు బి.మెర్సిరత్నవాణి, బి.లీలసుజీ, ఎస్.లక్ష్మి, బి.ఉష, బి.అఖిల, కె.జయమ్మ, ఎం.సుభాషిణి, జి.విజయలక్ష్మి, వై.శ్రీదేవి, పి.శాంతి, లలితమ్మ, పి.రాజ్యలక్ష్మి, ఎన్.సుప్రియలను ఎన్నుకున్నారు.

ఘనంగా టైలర్స్ దినోత్సవం



ఆత్మకూరు: ర్యాలీ నిర్వహిస్తున్న టైలర్లు

ఆత్మకూరు: పట్టణంలో టైలర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పలువురు దర్జీలు సత్రం సెంటర్ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత సెంటర్‌లోని అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం బీఎస్సార్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గౌస్‌మొహిద్దీన్, రవూఫ్, శ్రీను, రఫీ, ఇంతియాజ్, గోపాల్, సుల్తాన్, రహీం తదితరులు పాల్గొన్నారు.

- **అనుమసముద్రంపేట:** టైలర్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏఎస్‌పేటలో దర్జీలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సుభద్రను కలిసి టైలర్స్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో షేక్ నయీమ్, షేక్ ఇందాజ్, బాబు తదితరులు పాల్గొన్నారు.
- **చేజర్ల:** టైలర్స్ దినోత్సవాన్ని దర్జీలు మంగళవారం చేజర్లలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టైలర్స్ నాగా శ్రీనివాసులురెడ్డి, పఠాన్ రసూల్, రేనంగి కృష్ణ, హుస్సేన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రేపు శ్రీగంధం సాగుపై రైతులకు శిక్షణ

దుత్తలూరు: నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం, దుత్తలూరు సీడ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం స్థానిక సీడ్స్ సంస్థ కార్యాలయంలో రైతులకు శ్రీగంధం సాగుపై శిక్షణ ఇస్తున్నట్లు సీడ్స్ సంస్థ ప్రతినిధి వేణుగోపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీగంధం సాగులో రైతులకు సందేహాలు, సూచనలు ఇవ్వడమే కాకుండా శ్రీగంధం సాగు చేస్తున్న ఆదర్శ రైతుల పొలాలను కూడా చూపించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9908217465 మొబైల్ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ప్రసాదాల తయారీకి బెల్లం వితరణ

బిట్రగుంట: బోగోలు మండలంలోని కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో మార్చి 2వ తేదీ నుంచి జరగనున్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు పంపిణీ చేసే ప్రసాదాల తయారీ కోసం సుమారు 60 కేజీల బెల్లంను కొండబిట్రగుంట ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు డేగా విజిత మంగళవారం వితరణగా అందజేశారు. ఆర్గానిక్ పద్ధతిలో తయారు చేసిన బెల్లంను ఆలయ కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మద్దులూరి ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు సద్వినియోగం చేసుకోండి

వరికుంటపాడు: డాక్టర్ వైఎస్సార్ పశు ఆరోగ్య సేవలో భాగంగా సంచార వాహనం ద్వారా అందించే పశు వైద్యసేవలను మండలంలోని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని పెద్దిరెడ్డిపల్లి పశువైద్యాధికారి ఎస్‌వీఎస్ రాఘవేంద్రశర్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉదయగిరి నియోజకవర్గంలో రెండు సంచార వాహనాలు సేవలందిస్తుండగా, అదనంగా దుత్తలూరు ప్రాంతీయ పశువైద్యశాలకు మరో వాహనం కేటాయించారని తెలిపారు. ఈ వాహనం వరికుంటపాడు మండల పాడి రైతులకు కూడా సేవలందిస్తుందని తెలిపారు. పాడి రైతులు 1962 టోల్‌ఫ్రీ నంబరును సంప్రదించి పశువైద్య సేవలు పొందాలని తెలిపారు.

డాబా హోటళ్లలో తనిఖీలు

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని పలు డాబా హోటళ్లలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ బి.నయనతార ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సిబ్బంది ముమ్మర తనిఖీలు నిర్వహించారు. నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై ఉన్న డాబా హోటళ్లలో మద్యం విక్రయించినా, తాగేందుకు అనుమతించినా శిక్ష తప్పదని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో సెబ్ ఎస్సైలు మొగల్‌బాబు, పి.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు పునఃపరిశీలన

వరికుంటపాడు: మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు నిర్వహించిన ఈ–క్రాప్ నమోదు కార్యక్రమాన్ని మంగళవారం తహసీల్దార్ అబ్దుల్ హమీద్ పునఃపరిశీలించారు. సూపర్‌చెక్ కార్యక్రమంలో భాగంగా ఆయన వీఏఏలు వరికుంటపాడులో నమోదు చేసిన వరి, మినుము పంటలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆయన వెంట వీఆర్వో శేషారెడ్డి, వీఏఏ చంద్రశేఖర్ ఉన్నారు.

నేడు సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయం వద్ద సిద్ధేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా వివిధ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహించి బుధవారానికి పదహారు రోజులైన సందర్భంగా వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సిద్ధేశ్వరస్వామితోపాటు ఇతర దేవతామూర్తులకు వేకువజాము నుంచే అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే శ్రీరమా సమేత అన్నవరపు సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకోవాలని కోరారు.

అరుణాచలం గిరిప్రదక్షిణకు ప్రత్యేక బస్సు

కావలి రూరల్: కావలి పరిసర ప్రాంతాల ప్రజల విజ్ఞప్తి మేరకు ప్రతి పౌర్ణమికి అరుణాచలంలో గిరిప్రదక్షిణకు కావలి నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ ఆర్.శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న మేనేజర్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌర్ణమికి కావలి ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలానికి బస్సు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మొదటగా మార్చి 6వ తేదీన బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ బస్సు ఉదయం 8 గంటలకు బయలుదేరి రాత్రికి అరుణాచలానికి చేరుతుందని, గిరిప్రదక్షిణ అనంతరం తర్వాత రోజు తిగిరి బయలుదేరి సాయంత్రానికి కావలికి చేరుతుందన్నారు. సీట్ రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉందని, కావలి ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పేర్నాటి విజయానికి కృషి చేద్దాం



ఉదయగిరి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి



వింజమూరు: శ్యాంప్రసాద్‌రెడ్డిని పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి

- ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి

ఉదయగిరి: వైఎస్సార్‌సీపీ తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, కన్వీనర్లు సమష్టిగా కృషి చేద్దామని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని షాదీమంజిల్‌లో పేర్నాటికి మద్దతుగా నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలోని పట్టభద్రులను వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహ సారథులు, కన్వీనర్లు, కార్యకర్తలు కలిసి మొదటి ప్రాధాన్యతా ఓటును పేర్నాటికే వేసేలా కృషి చేయాలని తెలిపారు. ఒక్క అవకాశం ఇవ్వండి ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా తమ ఓటును మొదట ప్రాధాన్యతగా తనకే వేసి గెలిపించాలని కోరారు. ఉదయగిరి నియోజకవర్గంలో సుమారు 9 వేల మంది పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని తెలిపారు. ఉదయగిరి నియోజకవర్గానికి ఎంతోమేలు చేయబట్టే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిని ప్రజలు నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని తెలిపారు. తనకు ఎమ్మెల్సీగా ఒక్క అవకాశమిస్తే తనవంతుగా నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తానన్నారు. సమావేశంలో ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, సీతారామపురం మండలాల కన్వీనర్లు అక్కి భాస్కరరెడ్డి, ఆంధ్రా బాలగురవారెడ్డి, వాసిపల్లి వెంకటేశ్వరరెడ్డి, చింతంరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, వరికుంటపాడు జెడ్పీటీసీ సభ్యుడు రావిళ్ల నాగేంద్ర, సీతారామపురం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దుగ్గిరెడ్డి గురవారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కల్లూరి రమణారెడ్డి, నాయకులు గడియాల్సి ఎస్దానీ, ఖిల్జీ సలీం, ముర్తుజా హుస్సేన్, వెంగళరెడ్డి, కల్లూరి కృష్ణారెడ్డి, ఉప్పుటూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పేర్నాటిని గెలిపించండి

వింజమూరు: వైఎస్సార్‌సీపీ తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి పట్టభద్రులను కోరారు. స్థానిక ఎస్‌వీ కన్వెన్షన్‌లో మంగళవారం జలదంకి, కలిగిరి, కొండాపురం, వింజమూరు మండలాల పట్టభద్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలో విద్యా, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు శ్యాంప్రసాద్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలన్నారు. పేర్నాటిని గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలన్నారు. రాబోయే రోజుల్లో నిరుద్యోగాన్ని నిర్మూలించి ఉపాధి అవకాశాలు మెరుగుపడాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు ఎమ్మెల్సీ ఎన్నికల విజయమే నాంది కావాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఉదయగిరి ప్రాంత అభివృద్ధిలో తనను భాగస్వామిని చేయాలని కోరారు. పట్టభద్రుల సమస్యలను పరిష్కరించి ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలను పెంచేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు లంకా రామశివారెడ్డి, మండల కన్వీనర్లు రేవునూరు శ్రీనివాసులురెడ్డి, కాటం రవీంద్రారెడ్డి, చిమిలి రాజేంద్రప్రసాద్, సొసైటీ అధ్యక్షులు జూపల్లి రాజారావు, ఎం.శ్రీనివాసులురెడ్డి, నాయకులు పి.మాలకొండారెడ్డి, రేణమాల శ్రీనివాసులురెడ్డి, ఇందిరమ్మ, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, పట్టభద్రులు పాల్గొన్నారు.

సైన్స్‌పై అవగాహన కలిగి ఉండాలి



అల్లూరు: ప్రాజెక్ట్ నమూనాను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీరామకృష్ణ

మర్రిపాడు: సైన్సుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శివజ్యోతి పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సైన్సుకు సంబంధించి రూపొందించి ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. ప్రాజెక్టు నమూనాల రూపకల్పనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

- **ఆత్మకూరు:** పట్టణంలోని ప్రగతి ఇంగ్లిషు మీడియం పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు పలు ప్రాజెక్ట్ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. ఇతర పాఠశాలల విద్యార్థులు ఈ సైన్స్‌ఫేర్ చూసేందుకు ఉత్సాహంగా తరలివచ్చారు.
- **సీతారామపురం:** స్థానిక ఆదర్శ పాఠశాలలో మంగళవారం సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు పలు సైన్స్ ప్రాజెక్టులు రూపొందించి ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని కోటేశ్వరమ్మ, ప్రిన్సిపల్ రెహమాన్, బ్రహ్మయ్య, ప్రీతి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.
- **సోమశిల:** అనంతసాగరంలోని గ్రంథాలయంలో, చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏఎస్‌పేటకు చెందిన షేక్ ఆవాజ్ అహ్మద్ సహకారంతో ప్రపంచ దేశాల కరెన్సీ నోట్లు, నాణేల ప్రదర్శన, సైన్సు క్విజ్ నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.
- **అల్లూరు:** స్థానిక దేవిరెడ్డి శారద ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని అకడమిక్ ఫేర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పలు సైన్స్ ప్రాజెక్టుల నమూనాలను ప్రదర్శించారు. తహసీల్దార్ శ్రీరామకృష్ణ, ఎంఈఓ నాగేశ్వరరావు తదితరులు ప్రాజెక్ట్ నమూనాలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు.
- **ఉదయగిరి:** మండలంలోని అప్పసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కాంప్లెక్స్ స్థాయిలో విద్యార్థులు సైన్స్, ఇంగ్లిషు, గణితంలో ప్రాజెక్ట్ నమూనాలను రూపొందించి ప్రదర్శించారు.
- **జలదంకి:** మండలంలోని అన్ని పాఠశాలల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం కొండారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు తయారు చేసిన సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు పరిశీలించి విజేతలకు బహుమతులు అందించారు.
- **కలిగిరి:** స్థానిక పవిత్ర ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో సోమవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు.